గణతంత్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : ఆదివారం నిర్వహించనున్న 76వ భారత గణతంత్ర దినోత్సవానికి జిల్లా యంత్రాంగం ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. వేడుకలకు ప్రధాన వేదికగా నిలుస్తున్న పోలీసు పెరేడ్ మైదానాన్ని ఇప్పటికే తీర్చిదిద్దారు. వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

వేదికకు ఇరువైపులా వీఐపీలు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కూర్చొని వేడుకలను వీక్షించేందుకు వీలుగా సీటింగ్ అరేంజ్‌మెంట్ చేశారు. ప్రజలను ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఎస్పీ కార్యాలయ ప్రధాన ద్వారం నుంచి వేదిక వరకు చుట్టూ భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య పర్యవేక్షణలో పోలీసులు శనివారం రిహార్సల్స్ నిర్వహించారు.

గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంతోపాటు రిమ్స్‌కు వెళ్లే రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే నగర పాలక సంస్థ కార్యాలయం, కోటిరెడ్డిసర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, అన్నమయ్య సర్కిల్, ఏడురోడ్ల సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేడుకల సందర్భంగా కడప నగరం కొత్త కళను సంతరించుకుంది.

నేడు గణతంత్ర దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం పోలీసు పెరేడ్ మైదానంలో ఆదివారం జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. ఉదయం 8.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. 9.05 గంటలకు పోలీసులచే గౌరవ వందనాన్ని స్వీకరించి కవాతును పరిశీలిస్తారు. 9.15 గంటలకు మార్చ్‌ఫాస్ట్ ఉంటుంది. 9.25 గంటలకు జిల్లా ప్రజలనుద్దేశించి కలెక్టర్ తన సందేశాన్ని వినిపిస్తారు. 9.55 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరుగుతుంది. 10.15 గంటలకు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఘనంగా సన్మానిస్తారు. 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11.05 గంటలకు ప్రశంసాపత్రాలు, పతకాలు, బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుంది. 11.40 గంటలకు స్టాల్స్ సందర్శన, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. 11.55 గంటలకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగుస్తుంది.


విద్యుత్‌దీప వెలుగులో అన్నమయ్య సర్కిల్


విద్యుత్ దీప వెలుగుల్లో అంబేద్కర్ సర్కిల్


పోలీసు పెరేడ్ మైదానం గోడ వారగా మూడు రంగుల భారీ పతాకం


విద్యుత్‌దీప వెలుగుల్లో కలెక్టరేట్

మహిళా సమస్యల పరిష్కారానికి పోరాడాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలిగా నియమితులైన బండి దీప్తిరెడ్డి శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డిని కలిసి తన నియామకానికి కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ దీప్తి రాజకీయ కుటుంబం నుంచి వచ్చారని తెలిపారు. ఆమె తండ్రి సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి నిరంతరం రాయలసీమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటారని కొనియాడారు. భర్త నిత్యానందరెడ్డి డిప్యూటీ మేయర్‌గా సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటి కుటుంబ వారసురాలిగా వచ్చిన దీప్తి నగరంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

మొక్కల సంరక్షణ మన బాధ్యత

కడప ఎడ్యుకేషన్ : మొక్కల సంరక్షణ మన బాధ్యత అని వైవీయూ ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయంలోని సీతాకోక చిలుకల పార్కు విస్తరణలో భాగంగా శనివారం ఎన్.ఎస్.ఎస్. యూనిట్-2 పీవో డా.ఎస్పీ వి. రమణ ఆధ్వర్యంలో జంతుశాస్త్ర విభాగపు వలంటీర్లు, పరిశోధక విద్యార్థులతో కలిసి ప్రిన్సిపల్ మొక్కలు నాటారు.

క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం


విశేష అలంకారంలో శ్రీ నడివీధి గంగమ్మ తల్లి

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని శ్రీ నడివీధి గంగమ్మ తల్లి వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు ఈ సందర్భంగా 14 ఆదివారాలు అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఐదుగురు ముత్తయిదువులను ప్రత్యేకంగా ఆహ్వానించి పూజలు నిర్వహింపజేసి వారికి క్షేత్రం పక్షాన వడి బియ్యం అందజేస్తారు. ఐదవ ఆదివారాన్ని పురస్కరించుకుని ముందస్తుగా శనివారం ఈ క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులచే సామూహిక మంత్రోచ్చాటన నిర్వహింపజేశారు. వడి బియ్యం స్వీకరించనున్న మహిళా భక్తులచే పూజలు చేయించారు. ఆదివారం వీరికి వడి బియ్యం అందజేస్తారు.

అభినందన


అంధ విద్యార్థి నజియాను అభినందిస్తున్న కలెక్టర్

కడప ఎడ్యుకేషన్ : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సభాభవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కడప అంధుల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నజియా తబ్బుస్సుం పాడిన దేశభక్తి గీతంకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లు తన్మయం చెందారు. ఇందుకుగాను వారు ఆ విద్యార్థినికి మెమెంటో అందజేసి సత్కరించి అభినందించారు. దీంతోపాటు మ్యూజిక్ టీచర్ నవీన్‌ను, ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేపరాల ఏబెనిజర్‌లను కూడా ప్రశంసించారు.

ఎస్పీకి అభినందనలు

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్‌ను నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూల గుచ్ఛం అందజేసి అభినందించారు.


ఎస్పీకి మొక్క అందజేస్తున్న డీజీఎం రామ్మోహన్ రెడ్డి

ఘన సన్మానం


షఫీని సన్మానిస్తున్న అంజద్‌బాష, ఇతర నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడిగా నియమితులైన షఫీని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాష, పార్టీ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ పార్టీ స్థాపించినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నగర మైనార్టీ అధ్యక్షునిగా తనను నియమించి, ఇప్పుడు మరోసారి అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుబాన్‌బాష, రమేష్ రెడ్డి, అజ్మతుల్లా, టిపి వెంకటసుబ్బమ్మ, ఇలియాస్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు కాజేసి బెదిరిస్తున్నారు

కడప రూరల్: కష్టపడి కూడబెట్టుకున్న డబ్బును కాజేయడమే గాక తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని కడప నగరం విజయభారతి స్వయం సహాయక సంఘ సభ్యులు షేక్ మెహరాబీ, కృష్ణకుమారిలు అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కష్టార్జితంతో పైసా పైసా కూడబెట్టి స్వయం సహాయక సంఘం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అయితే తమ సంఘం నిర్వహణకు సంబంధించిన రిసోర్స్ పర్సన్ తో పాటు ఆమె కుమారుడు తమను మోసగించారని ఆరోపించారు. ఒకరికి తెలియకుండా మరొకరు దాదాపు రూ. 37 లక్షల వరకు డ్రా చేసినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ తో పాటు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ కుమారుడు హైదరాబాదులో ఉన్నాడని, అతను తమ డబ్బును కాజేయడమే కాక తమపైనే తప్పుడు కేసులు బనాయిస్తామని బెదిరించినట్లుగా ఆరోపించా రు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

కూటమి నేతలు హామీలను నెరవేర్చాలి

కడప సెవెన్‌రోడ్స్ : కూటమి నేతలు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్ చేశారు. శనివారం పార్టీ అధ్యక్షురాలి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెక్టరేట్ ఎదుట థాలీ భజావో కార్యక్రమం నిర్వహించారు. ప్లేట్లు – స్పూన్లతో పెద్ద శబ్దం చేస్తూ మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు సంక్షేమ పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయలేదన్నారు. కేవలం కమిటీలతో, ప్రణాళికలతో కాలయాపన చేయడం పాలక ప్రభుత్వానికి తగదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడపలో బీజేపీ ర్యాలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంవిధాన్ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ జాతీయ, రాష్ట్ర పిలుపు మేరకు బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగ గౌరవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌నాయుడు, జిల్లా కార్యదర్శి ఓబులేశు, కోశాధికారి శ్రీకాంత్, బీజేపీ కడప జిల్లా ఉపాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పట్టణ ప్రాంతాల్లో ఇంటి అద్దెలు కట్టుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణం తక్షణం చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 27న కలెక్టరేట్ ఎదుట వ్యక్తిగత అర్జీలతో ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ.బాదుల్లా తెలిపారు. శనివారం నగరంలోని నకాష్, కుమ్మరకుంట, ఖలీల్ నగర్ ప్రాంతాలలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేద ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది మాసాలు అవుతున్నా కడప ఉక్కు పరిశ్రమ ఊసే లేదని అఖిల భారతీయ యువజన సమైక్య నగర కార్యదర్శి సి.శివ నాగేంద్ర తెలిపారు. శనివారం నగరంలోని ఐటీఐ కళాశాలలో ఏఐవైఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల హామీలు నీటిమీద రాతలు లాగానే మిగిలిపోతున్నాయే కానీ కడప ఉక్కు పరిశ్రమ కు అడుగులు ముందుకు పడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సంజీవ్, ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మన ఓటు .. దేశ భవిష్యత్తు

కడప ఎడ్యుకేషన్ : ఓటు దేశ భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని ప్రిన్సిపాల్ ప్రొ.ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవా కేంద్రం యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొ. ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కుపై, ప్రజా స్వామ్య వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ఓటర్ అవేర్నెస్ ప్రోగ్రామ్ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు, అధ్యాపకులు , వలంటీర్లు పాల్గొన్నారు.

కడప నగర శివార్లలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ ఉదయ్ ప్రకాష్‌రెడ్డి , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళుతున్న వైవీయూ విద్యార్థులు, సిబ్బంది

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఎంఆర్ స్ట్రీట్ మేదరవీధిలో వెలసిన సయ్యద్ షా హజరత్ నాదర్ షావలి ఉరుసు ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని గురువుల ఆశీస్సులు పొందాలని కడప నగర ప్రముఖులు సుబాన్‌బాష పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి ఉరుసు ఉత్సవాల పోస్టర్లను ఆయన ఇతర అతిథులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంధం ఫిబ్రవరి 1 వ తేది నిర్వహించి అనంతరం మెరవణి కార్యక్రమం ఉంటుందన్నారు. 2వ తేది ఉరుసు ఉత్సవాలను నిర్వహించనున్నారన్నారు. అదేరోజు రాత్రి ఖవ్వాలీ కచేరీ ఉంటుందన్నారు. 3వ తేదీ నాతియా మెహఫిల్ నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షంషీర్, గౌస్ చాక్లెట్, అలీ అక్బర్, నందలూరు ఫైయాజ్, నాదర్, ముదసర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.


ఉరుసు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సుబాన్‌బాష తదితరులు

యాత్ర విజయంతో ఐక్యత బలపడాలి

కడప కల్చరల్ : శ్రీరామ మహా శోభాయాత్ర విజయంతో మన ఐక్యత బలపడాలని కడప నగరానికి చెందిన దాదాపు అన్ని ధార్మిక సంస్థలు అభిప్రాయపడ్డాయి. ఈనెల 22న శ్రీరామ మహాశోభాయాత్ర దాదాపు 19 గంటల పాటు కడప నగరంలో నిర్విరామంగా జరిగిన సందర్భంగా శనివారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధి, ఆలయ నిర్వాహకులు దేసు వెంకటరెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతోనే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయగలిగామని తెలిపారు. అర్చక బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు విజయభట్టర్ శ్రీ సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు తోడ్పడిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దాతలందరినీ సత్కరించారు.


దాతను సత్కరిస్తున్న అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధులు

ఇష్టపడి చదివితే మంచి ఫలితం

కడప రూరల్ : విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితం ఉంటుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, స్టెప్ సీఈవో సామీ గ్రేస్ అన్నారు. ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై శనివారం స్థానిక ఎస్సీ హాస్టల్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షలంటే విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఇష్టపడి అవగాహనతో చదివితే మంచి ఫలితం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ లక్ష్మీనారాయణ, వసతి గృహ సంక్షేమాధికారులు లీలావతి, ఎస్.వెంకటరమణ, ఎం శిరీష, ఏ పద్మజ, ఎస్ వెంకటరమణయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి

ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కమిషనర్ మార్నింగ్ విజిట్‌లో భాగంగా పలు ప్రాంతాలలో పర్యటించారు. నగరంలోని ఓం శాంతి నగర్, చిలకల బావి, పోలీస్ గ్రౌండ్ ప్రాంతాలలో ఆయన ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రత కాపాడాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. పోలీస్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. మొబైల్ టాయిలెట్ల వద్ద నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు.


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మనోజ్ రెడ్డి

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నేట్లపల్లి శివరామ్ యాదవ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నేట్లపల్లి శివరామ్ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని బీసీలను సంఘటితపరచి పార్టీకి దగ్గర చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య, పార్టీ నాయకులు ఆదిమూలం వెంకట శివయ్య, కొప్పుల శివ పాల్గొన్నారు.


రవీంద్రనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేట్లపల్లి శివరామ్ తదితరులు

మత్తు పదార్థాల ప్రమాద తీవ్రతపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సాధన కోసం యువత సమాయత్తమై ప్రజలకు అవగాహన కల్పించాలని వైస్ ఛాన్సలర్ ప్రొ.కె. కృష్ణా రెడ్డి అన్నారు. శనివారం వైవీయూ క్యాంపస్‌లో యాంటీ డ్రగ్ యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొ.కె. కృష్ణా రెడ్డి, రిజిస్ట్రార్, ప్రొ.పి. పద్మా , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డిలు మత్తు పదార్థాలను సేవించడం వల్ల కలిగే నష్టాన్ని విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఉజ్వల భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. చదువు పైన ఆసక్తి ఉంచి పట్టుదలతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ నోడల్ అధికారులు డా.ఎస్. శ్రీనివాస గౌడ్, డా.ఎస్ సుమిత్ర ఆధ్వర్యంలో జరిగింది.


ర్యాలీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు

ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ బదిలీలను జీరో సర్వీస్ ప్రామాణికంగా తీసుకుని నిర్వహించాలని ఎస్టీయూ ఏపీ కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం కడపలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి విచ్చేసిన పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజును స్టేట్ గెస్ట్ హౌస్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఉర్దూ పాఠశాలలను తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమ పాఠశాలలలో అనుసంధానం ఆపాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్ అన్నారు. కడపకు విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయ రామ రాజును కలిసి ఈ మేరకు ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు.

పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజును పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య ఆధ్వర్యంలో నాయకులు మోపూరు వెంకటశివారెడ్డి, గుజ్జల తిరుపాల్, అల్లూరు వెంకటరమణ కలిసి పూలగుచ్ఛంతో స్వాగతం పలికారు.


విజయరామరాజుకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

నగరంలో ర్యాలీ

కడప కార్పొరేషన్ : రోడ్డు భద్రతా వారోత్సవాలు, గణతంత్ర దినోత్సవ సందర్భంగా హరూన్ బజాజ్, బజాజ్ చేతక్, కేటీఎం ఆధ్వర్యంలో శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత జాగ్రత్తలు తీసుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మొబైల్ మాట్లాడుతూ వాహనాన్ని నడపవద్దని నినదించారు. వాహనాలను వేగంగా నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని ప్రజలకు సూచించారు.


రోడ్డు భద్రత వారోత్సవాల్లో పాల్గొన్న హరూన్ బజాజ్ సిబ్బంది

ఆందోళనకు తరలిరావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులందరూ పాల్గొనాలని సీపీఐ నగర కార్యదర్శి యన్. వెంకట శివ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర శివార్లలోని సరోజినీ నగర్, చలమారెడ్డి పల్లె వద్ద నిర్మించిన దాదాపు 2342 టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు అప్పచెప్పలేదన్నారు. కూటమి ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు.

నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యార్థుల ప్రాణాలను ఫీజుల రూపంలో బలి తీసుకుంటున్న నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఈ మేరకు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అనంతపురంలోని సోమలదొడ్డి దగ్గర ఉన్న నారాయణ బాయ్స్ క్యాంపస్ లో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న టి. చరణ్ అనే విద్యార్థి కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి నిలబెట్టారని, అతడు మనస్థాపానికి గురై మూడవ అంతస్తు నుంచి దూకి మరణించాడన్నారు. ఆ విద్యార్థి మరణానికి కారకులైన నారాయణ విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కడప నగర అధ్యక్ష కార్యదర్శులు జాలా సుమంత్, మోహన్, నగర ఉపాధ్యక్షులు వంశీ, నగర నాయకులు పాల్గొన్నారు.